## శాంతిని నెలకొల్పాలి: మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని మోదీకి ఇరాన్ అధ్యక్షుడు పేజేష్కియాన్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు దౌత్య మార్గాలు, చర్చల ద్వారా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పి, భద్రత, సుస్థిరతను స్థాపిం చాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడిపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విస్ఫోటనం అంచున ఉన్న ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచడం వల్ల అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు, అమెరి కా దాడుల నేపథ్యంలో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ వద్ద ఎలాంటి రేడియేషన్ లీకేజీ లేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రాఫెల్ గ్రాసీ ప్రకటించారు. ఇరాన్‌పై అమెరికా దాడిని పాకిస్థాన్ కూడా ఖండించింది. తనను తాను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు ఉందని స్పష్టం చేసింది.


# దాసరి ఉదయం

https://epaper.udayamdaily.com

తెలుగు దినపత్రిక

సంపుటి : 13 సంచిక : 304 జగిత్యాల ఎడిటర్ - మొహమ్మద్ ఇమ్రాన్ శనివారం 19, జూలై 2025 పేజీలు : 04 వెల : 1.00/-





విజయనగరం రూరల్, సింహాచలం : గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజు తెదేపా శాశ్వత సభ్యత్వానికి, పార్టీ పొలిట్ బ్యూరో పదవికి రాజీనామా చేశారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకి లేఖ పంపించారు. కుటుంబ సమేతంగా సింహాచలం అప్పన్నస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో రాజీనామా పత్రాలపై అశోక్ గజపతిరాజు సంతకాలు చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని తెదేపా అధినేత చంద్రబాబును కోరారు. తెదేపా సభ్యుడిగా, నాయకుడిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా పత్రాలపై సంతకాలు చేసిన సందర్భంగా అశోక్‌గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 1978లో తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైనప్పుడు అప్పన్నస్వామిని దర్శించుకున్న అనంతరం అసెంబ్లీకి వెళ్లినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. గవర్నర్‌గా ఎంపికైన నేపథ్యంలో స్వామి దర్శనం అనంతరం పదవి చేపట్టనున్నట్లు తెలిపారు. తాను సుదీర్ఘకాలం కొనసాగిన పార్టీకి రాజీనామా చేయడం బాధాకరంగా ఉందని భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. పసుపు రంగు పవిత్రతకు ప్రతిరూపమని ఆ పవిత్రతను కాపాడేలా పనిచేస్తానని చెప్పారు. రాజీనామా విషయం ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతో ఫోన్‌లో మాట్లాడి ఆమోదం తీసుకున్నట్లు అశోక్ గజపతిరాజు తెలిపారు.




### తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం, స్టోరేజీపై దృష్టి పెట్టాలి: సీఎం చంద్రబాబు

అమరావతి: గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యం పెరిగిందని, విద్యుత్ తయారీ సంస్థలు దీనిపై పరిశోధనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో సీఎం పాల్గొని ఎనర్జీ కంపెనీల ఎండీ, సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "మీ ఆలోచనలు వినడానికి, ఆవిష్కరణలు తెలుసుకోవడానికే ఇక్కడకు వచ్చాను. విద్యుత్ సంస్కరణలు మొదట ప్రారంభించింది నేనే. సంస్కరణలు అమలు చేసిన కారణంగా అప్పట్లో అధికారం కోల్పోయాం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజీపై దృష్టి సారించాలి. ఏపీ ఇలాంటి పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కావాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. 5 గిగావాట్ల హరిత విద్యుత్ తయారు చేయాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించారు. నీతి ఆయోగ్ కూడా దీనిపై దృష్టి సారించింది. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ హైడ్రోజన్ వ్యాలీగా మారనుంది" అని సీఎం అన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్ కూడా పాల్గొన్నారు.




విశాఖ: రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎప్పటికీ పూర్తికాదు.. ఎవరికీ అర్థం కాదని గతంలో వైకాపా నేతలు మాట్లాడారని గుర్తుచేశారు. పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసినవారికి ఇవాళ మళ్లీ మాట్లాడే నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా తెచ్చుకోలేని వ్యక్తి అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. "జగన్ హయాంలో గత ప్రభుత్వం పోలవరాన్ని ధ్వంసం చేసింది. 2027 డిసెంబర్ కల్లా ఈ ప్రాజెక్టు పూర్తిచేసి గోదావరి వరద నీరు ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రకాశం జిల్లా అత్యంత వెనకబడిన జిల్లా. వెలిగొండ ప్రాజెక్టు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉంది. దాన్ని 2026 కల్లా పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీరిస్తాం. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. దాన్ని ఏవిధంగానూ వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఐదు సంవత్సరాలు జగన్ ఉత్తరాంధ్రపై కపటప్రేమ చూపించారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేసి ఉంటే ఇవాళ పురుషోత్తపట్నం నుంచి విశాఖ, ఉత్తరాంధ్రకు నీరు వచ్చేది" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.




అనంతపురం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఏపీ పురపాలక శాఖమంత్రి నారాయణ తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. "ఇచ్చిన మాట ప్రకారం ఏ ఒక్క హామీ నుంచి వెనక్కి తగ్గట్లేదు. సీఎం చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి జరిగితేనే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది.. కానీ, చెత్త తొలగించలేదు. కూటమి ప్రభుత్వం రాగానే చెత్తపై పన్ను తొలగించాం" అని మంత్రి తెలిపారు.




### భారీ వర్షం.. మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు..

హైదరాబాద్, జులై 18: నగరంలో భారీ వర్షం కురుస్తోంది. ఇలాంటి వేళ నగరవాసులకు హైడ్రా హెచ్చరికలు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దంటూ సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించింది. ఇక, హైదరాబాద్‌లో మరో గంటపాటు భారీ వర్షం పడే అవకాశం ఉంది. షేక్ పేట్, ఖాజాగూడ, రాయదుర్గం, గచ్చిబౌలిలో భారీ వర్షం కారణంగా జనం అవస్థలు పడుతున్నారు. కొండాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్, మియాపూర్ లో భారీ వర్షం పడింది. రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే టైమ్ కావడంతో ఫుల్ ట్రాఫిక్ కనిపిస్తోంది. రాయదుర్గం, షేక్ పేట్ మార్గంలో 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఐటీ కారిడార్ ఉంది. కొన్ని రోడ్లు నాలాలను తలపిస్తున్నాయి. రాయదుర్గం, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలి పిజేఆర్ ఫ్లైఓవర్ పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏఎంబీ మాల్ ముందు వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. హఫీజ్ పేట్, ఆల్విన్ కాలనీ, చందానగర్ మార్గంలో ఫుల్ ట్రాఫిక్ ఉంది. హైటెక్ సిటీ, కెపీహెచ్‌బీ మార్గంలో భారీగా ట్రాఫిక్ ఉంది. ఐటీ కారిడార్ రోడ్లు స్విమ్మింగ్ పూల్స్ ను తలపిస్తున్నాయి. టోలిచౌకి, మెహదీపట్నం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటరు ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతోంది. టోలిచౌకి నానల్ నగర్ జంక్షన్ వద్ద నాలా పొంగిపొర్లుతోంది. వరద ప్రవాహానికి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గ్రేటర్ లో 7.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు గంటలపాటు నగరవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని సమాచారం అందుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. అటు, సంగారెడ్డి జిల్లాలోనూ పలు చోట్ల భారీ వర్షం కురుస్తోంది. సంగారెడ్డి, పఠాన్ చెరు, ఆర్సీ పురం, జిన్నారం, సదాశివపేట మండలంలో భారీగా వర్షం కురుస్తోంది.

### అక్కున చేర్చుకున్న పాలమూరుకు కేసీఆర్ చేసిందేమిటి?: సీఎం రేవంత్‌రెడ్డి



కొల్లాపూర్: తెలంగాణలోని ప్రాజెక్టులకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ సీఎం అయ్యాక ఎక్కువ అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రజలు ఆయన్ను అక్కున చేర్చుకుని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతానికి ద్రోహం చేశారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన కొల్లాపూర్ ప్రాంతానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. "పాలమూరు బిడ్డలు కేసీఆర్‌ను అక్కున చేర్చుకుని పార్లమెంట్‌కు పంపారు. సీఎం అయిన తర్వాత ఈ గడ్డకు ఆయన చేసిందేమిటి?శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఎందుకు న్యాయం చేయలేదు. జీవో 98 ద్వారా ఇవ్వాల్సిన పరిహారం ఎందుకు ఇవ్వలేదు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని చెప్పి కేసీఆర్ మాట తప్పారు. అలంపూర్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో ఉన్న ఈ వర్గాలకు ఎందుకు న్యాయం చేయలేదు. కరీంనగర్ నుంచి పారిపోయి పాలమూరు వస్తే అండగా నిలబడ్డాం. పదేళ్ల పాలనలో ఈ ప్రాంతానికి సున్నం పెట్టింది మీరు కాదా? ఇప్పుడు దుఃఖం వస్తోందని కేసీఆర్ అంటున్నారు. మాదిగల పిల్లలకు వైద్య విద్య సీట్లు వస్తుంటే దుఃఖం వస్తోందా? పాలమూరు బిడ్డ 20 ఏళ్లు సీఎంగా ఉండాలని ఈ జిల్లా కంకణం కట్టుకున్నందుకు దుఃఖమొచ్చిందా? పాలమూరు వాసులు చేపలు పట్టుకోవాలి.. చెప్పులు కుట్టుకోవాలా? మీ పిల్లలు రాజ్యాలు ఏలాలా? పాలమూరు పచ్చగా మారుతుంటే ఎందుకంత విషం చిమ్ముతున్నావు? ఈ జిల్లా అంటే ఎందుకింత చిన్నచూపు? కేసీఆర్‌కి మద్దతిస్తున్న ఆ పార్టీ జిల్లా నేతలు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డికి సిగ్గుండాలి. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలనలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తిచేయలేదు? కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, జూరాల ప్రాజెక్టుల పరిస్థితి ఏమైంది? ఒక్క కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. 2019లో కడితే.. 2023లో అది కూలింది. చిన్నగుడిసె వేసుకునేవాడు అయినా పదేళ్లు ఉండేట్టు నిర్మించుకుంటాడు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు ఎన్ని వందలకోట్లు ఖర్చు అయినా.. ఈ ఏడాది డిసెంబర్ 9లోపు నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చి భూమి సేకరిస్తాం. రానున్న రెండేళ్లలో ఆ ప్రాజెక్టులు పూర్తిచేయాలని నిర్ణయించాం"అని రేవంత్‌రెడ్డి అన్నారు.




ఖమ్మం: తనపై టన్నుల కొద్దీ కేసులు పెట్టారని.. చివరికి గుండు సూదంత ఆధారం చూపలేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. ధైర్యం ఉంటే ఏం ఆధారాలు ఉన్నాయో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. "దుబాయ్‌లో ఎవరో చనిపోతే నాకేం సంబంధం. దురలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలి. నేను జీవితంలో ఏనాడూ సిగరెట్ కూడా తాగలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నాపై ఎన్నో ఆరోపణలు చేశారు. నేను ఏం చేసినా.. బాజాప్తా చేస్తా. నేను ఏపీ మంత్రి లోకేశ్‌ను కలవలేదు.. ఒక వేళ కలిసినా తప్పేంటి? నారా లోకేశ్ నాకు మంచి మిత్రుడు.. ఆయనతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన పక్క రాష్ట్రం మంత్రి.. నాకు తమ్ముడి లాంటి వారు. డైవర్షన్ పాలిటిక్స్ తప్ప.. రేవంత్‌రెడ్డి 20 నెలల్లో చేసింది శూన్యం. నా విషయంలో ఓసారి డ్రగ్స్ అంటారు, ఓ సారి కార్ రేసింగ్ అంటున్నారు. రేవంత్‌రెడ్డి వల్ల యూట్యూబర్లకు మినహా ఎవరికీ లాభం చేకూరలేదు. గాసిప్‌ల మాయలో పడి.. ఆరు గ్యారంటీలను మర్చిపోదామా? బనకచర్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు. దిల్లీ భేటీ అజెండాలో బనకచర్ల అంశమే లేదన్నారు. దిల్లీ కేంద్రంగా రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేశారు. చంద్రబాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. 420 హామీల విషయంలో కాంగ్రెస్‌తో ఫుట్‌బాల్ ఆడటం ఖాయం" అని కేటీఆర్ అన్నారు.

### బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు



బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని మంత్రి శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు. అంతకు ముందు మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాసర అమ్మవారిని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. మాస్టర్ ప్లాన్, ఆలయ పెద్దల సూచనలతో ఆలయాన్ని తీర్చిదిద్దే కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జ్ఞాన సరస్వతి కొలువుదీరిన ప్రదేశంలో టిపుల్‌ఐటీని నెలకొల్పారని గుర్తుచేశారు. ఈ ప్రాంతాన్ని చదువులకు నిలయంగా నిలపాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

ఉదయం



# చేతులు కలిసేనా!

కరీంనగర్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయ సమావేశాలను కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా, మండల స్థాయి అధ్యక్షుల నియామకం, పార్టీ పదవుల విషయమై చర్చించి దిశా నిర్దేశం చేయడంతో పాటు అర్హుల జాబితా రూపొందించనున్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో పాటు రాజేందర్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నారు.
కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ సమావేశాలు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనున్నాయి. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు సంబంధించి తర్వాత నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. పెద్దపల్లిలో ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌కు ఆయువుపట్టుగా ఉన్న కరీంనగర్‌లో నాయకుల మధ్య సమన్వయం కొరవడిందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకున్న తర్వాత ఇప్పటివరకు కొత్త ఇన్‌ఛార్జిని నియమించలేదు. దీంతో ముగ్గురు నేతలు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన నరేందర్‌రెడ్డి, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేందర్‌రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమావేశానికి ఎవరికి వారే వెళ్లడం పార్టీలో చర్చనీయాంశమైంది. జరిగే సమావేశంలో నేతల మధ్య సమన్వయం కుదర్చాల్సి ఉంది. ఈ విషయంలో పార్టీ నేతలు స్పందించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

**కొందరికే ఆహ్వానం**

సమావేశాలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ కార్యదర్శి, కార్పొరేషన్ల ఛైర్మన్లు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్లు, సుడా ఛైర్మన్, ఇతర ముఖ్యులను మాత్రమే ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం కరీంనగర్ జిల్లా, మధ్యాహ్నం రాజన్న సిరిసిల్ల జిల్లా సమావేశాలు జరుగుతాయని పార్టీ ముఖ్యుడు ఒకరు తెలిపారు.

# భూసారానికి దన్ను

కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. ప్రజలు ఎక్కువగా వ్యవసాయాధారితంగా జీవనం సాగిస్తుంటారు. సాగులో భాగంగా అధిక మోతాదులో ఎరువులు వాడటంతో భూసారం తగ్గి దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట పెంపకం, పశువులు, కోళ్ల పేడ, సేంద్రియ ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తుండటం సత్ఫలితాన్నిస్తోంది.

**పది వేలకుపైగా ఎకరాల్లో పచ్చిరొట్ట**

జిల్లాలో ఈ వానాకాలంలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది పచ్చిరొట్ట కోసం అధికారులు 4,800 క్వింటాళ్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా సుమారు 1200 క్వింటాళ్ల మేర సరఫరా అయింది. వీటిని 13 మండలాలకు పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 10 వేలకుపైగా ఎకరాల విస్తీర్ణంలో పచ్చిరొట్ట సాగు చేశారు. 30 కిలోల బస్తాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేసింది. రైతులు వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట పైర్లను యంత్రాలతో కలియదున్నారు. దీంతో భూసారం పెరిగి వరి ఏపుగా, ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడనుంది.

**పెట్టుబడి ఆదా.. దిగుబడి పెంపు** పుల్కం మల్లేశం, రైతు, మరిమడ్ల



నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరోరెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. ఏటా నాలుగు ఎకరాల్లో క్రమం తప్పకుండా పచ్చిరొట్ట విత్తనాలు వేస్తున్నా. దీంతో భూమి గుల్లగా మారి పోషకాలు పెరుగుతున్నాయి. పెట్టుబడి తగ్గుతోంది.

**విత్తన ఉత్పత్తికి ఆస్కారం**

సందీప్, ఏవో, కోనరావుపేట

పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరిగి మొక్కల ఎదుగుదలకు పోషకాలు అధికంగా లభిస్తాయి. పంటకు దోహదం చేసే మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయి. రైతులు పంటల సాగులో పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. రైతులు ఏటా పచ్చిరొట్టను సాగు చేసుకొని విత్తన ఉత్పత్తి చేసుకోవాలి. పంట కాలం 60–70 రోజులు, ఎకరాకు 10–12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాకు రూ.8 వేల ధర పలకగా సాగుకు ఎలాంటి ఖర్చు లేకుండా రూ.90 వేల ఆదాయం పొందొచ్చు. దీంతో గ్రామంతోపాటు ఇతర గ్రామాల రైతులకు సకాలంలో పచ్చిరొట్ట ఎరువులు రైతులే సరఫరా చేయటానికి ఆస్కారం ఉంటుంది.

# జూలై 19..."పెద్దమనుషుల ఒప్పందం" కుదిరిన దినం - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యం




ఫజల్ అలీ కమిషన్ నివేదిక ప్రాతిపదికగా, తెలంగాణ, విశాలాంధ్ర వాద నేతల చర్చోప చర్చలు అనుమానాలు సందేహాలు నివృత్తి అనంతరం జూలై 19న పెద్దమనుషుల ఒప్పందం కుదిరింది. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు అనుకూలంగా మారింది. ఈ నేపద్యంలోకి వెళితే... ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం బ్రిటిషు పరిపాలనా కాలంలో, మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నిటినీ ప్రెసిడెన్సీ నుండి విడదీసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని కోరుతూ తెలుగు వారు ఉద్యమించారు. పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షతో ఉచ్ఛస్థాయికి చేరిన ఈ ఉద్యమం ఆయన మరణం తర్వాతనే సఫలీకృతమైంది. 1953 అక్టోబరు 1 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రెసిడెన్సీ లోని తెలుగు భాష మాట్లాడే ప్రజలున్న భూభాగాన్ని వేరుచేసి దీన్ని ఏర్పరచారు. 1953 డిసెంబరులో సయ్యద్ ఫజల్ ఆలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషను ఏర్పాటయింది. 1955 సెప్టెంబర్ 30 న తన నివేదిక సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కమిషను సమర్ధించింది. మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్ర లోను, కన్నడం మాట్లాడే ప్రాంతాలను కర్ణాటక లోను కలిపి తెలుగు మాట్లాడే ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించింది. అయితే ఐదు సంవత్సరాల తరువాత రాష్ట్ర శాసనసభలో మూడింట రెండు వంతులు సభ్యులు ఒప్పుకుంటే, ఆంధ్రతో విలీనం చెయ్యవచ్చని కూడా సూచించింది. కమిషను సూచనలను ఆహ్వానించి, ప్రత్యేక రాష్ట్ర వాదనను సమర్ధించిన వారిలో కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ప్రముఖులు. హైదరాబాదు శాసనసభలో అధిక శాతం సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్ధించారు. శాసనసభలో ఈ విషయంపై చర్చ జరిగినపుడు, 103 మంది సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌కు మద్దతు తెలుపగా, 29 మంది మాత్రమే వ్యతిరేకించారు. 15 మంది తటస్థంగా ఉండి పోయారు. ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్ధించిన ప్రముఖ నాయకులలో అప్పటి ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణా రావు, మాడపాటి హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ మొదలైనవారు ఉన్నారు. దీని నివేదికపై తెలంగాణ, విశాలాంధ్ర వాదులు తమతమ వాదనలను తీవ్రతరం చేసారు. కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, హైదరాబాదు శాసనసభకు రాజీనామా చేసి, ఈ విషయంపై ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. కాంగ్రెసు అధిష్ఠానం కూడా ఆంధ్ర ప్రదేశ్‌నే సమర్ధించి, ఆంధ్ర, తెలంగాణ నాయకులను తమ విభేదాలను పరిష్కరించుకొమ్మని ఒత్తిడి చేసింది. అయితే తెలంగాణ నాయకులకు తమ ప్రాంత అభివృద్ధిపై కొన్ని సందేహాలు ఉండేవి. అధిక రెవిన్యూ ఆదాయం గల తమ ప్రాంతం, అదే నిష్పత్తిలో అభివృద్ధికి నోచుకోదేమోనన్న భయం వారికి కలిగింది. ఇటువంటి ఇతర సందేహాల నివృత్తికై అన్ని ప్రాంతాల కాంగ్రెసు నాయకులు కలిసి 1956 ఫిబ్రవరి 20 న ఢిల్లీలో సమావేశ మయ్యారు. తెలంగాణ తరపున బూరుగుల రామకృష్ణా రావు, కె.వి.రంగారెడ్డి (మర్రి చెన్నారెడ్డికి మామ. ఆయన పేరిటే 1978 లో చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రంగారెడ్డి జిల్లా ఏర్పాటయింది.), మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ్ రావు పాల్గొనగా, ఆంధ్ర తరపున బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ విధంగా అనేక చర్చలు, సంప్రదింపుల అనంతరం 1956 జూలై 19 న వారి మధ్య పెద్దమనుషుల ఒప్పందం కుదిరిందిబీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 1956 నవంబర్ 1న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భవించింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. పెద్ద మనుషుల ఒప్పందంలోని ముఖ్యాంశాలు ఇవి: కనీసం ఐదేళ్ళపాటు, ప్రాంతాల వారీ రెవిన్యూ వసూళ్ళకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు పెట్టాలి. తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే మిగులు ఆదాయాన్ని ఆ ప్రాంతపు అభివృద్ధికే కేటాయించాలి. తెలంగాణలో విద్యాసంస్థలను అభివృద్ధి చెయ్యాలి. స్థానిక విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషనులు ఇవ్వాలి. సివిలు సర్వీసులకు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు నియామకాలు జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలి. ఐదేళ్ళ పాటు పాలనా వ్యవస్థలోను, న్యాయ విభాగం లోను ఉర్దూ వినియోగం కొనసాగాలి. రాష్ట్ర మంత్రివర్గంలో నిష్పత్తి ప్రకారం సభ్యులు ఉండాలి. ముఖ్యమంత్రి కోస్తా, రాయలసీమ నుండి ఉంటే ఉప ముఖ్యమంత్రి తెలంగాణ నుండి, ముఖ్యమంత్రి తెలంగాణ వ్యక్తి అయితే ఉప ముఖ్యమంత్రి ఇతర ప్రాంతాల నుండి ఉండాలి. ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత తెలంగాణ అభివృద్ధి మండలికి ఉండాలి. మండలి సభ్యులు తెలంగాణ ప్రాంతం నుండి ఎన్నికైన శాసన సభ్యులు ఉండాలి. తెలంగాణలో మద్యపాన నిషేధాన్ని తెలంగాణ శాసనసభ్యులు కోరిన విధంగా అమలు చెయ్యాలి. తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాల్లో చేరేందుకు ఆ ప్రాంతంలో కనీసం 12 ఏళ్ళపాటు నివసించి ఉండాలని నిబంధన రూపొందించాలి. కాబినెట్ మంత్రులలో 40 శాతం తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే ఉండాలి. ఆ ఒప్పందం తరువాత తెలంగాణ నాయకులలో ఉన్న సందేహాలు తొలగి, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆ ఒప్పందాన్ననుసరించి 1956 నవంబర్ 1 న ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఒప్పందం అమలులో ఆంధ్ర నాయకులు చిత్తశుద్ధి ప్రదర్శించలేదు. విలీనానికి మరొక మార్గం కనిపించక పోవటంతో ఒప్పందం చేసుకున్నారే తప్ప, ఆ ఒప్పందం అమలుకు ఆసక్తి చూపలేదు. అసలు రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ఒప్పందాల ఉల్లంఘన మొదలైంది. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణకు విస్తృతమైన అధికారాలుగల ప్రాంతీయ మండలి ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ కమిటీ కేవలం సలహాలు మాత్రమే ఇవ్వగలదు. తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు తగ్గట్లు విధానాలు తయారుచేసే అధికారాలు దీనికి లేవు. తెలంగాణకు సంబంధించిన హక్కుల ఉల్లంఘన మొదటిదిగా ఇలా మొదలైంది. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి ఆంధ్రకు చెందిన వ్యక్తి అయినప్పుడు తెలంగాణ వారికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి. అయితే, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అయిన నీలం సంజీవరెడ్డి తెలంగాణ వారికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వటానికి నిరాకరించారు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం 1962 వరకు తెలంగాణ ప్రాంతానికి విడిగా కాంగ్రెస్ కమిటీ ఉండాలి. కానీ 1957లోనే తెలంగాణకు ఉన్న కాంగ్రెస్ కమిటీనికి రద్దుచేసి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో విలీనం చేశారు. దాంతో తెలంగాణ నుంచి నాయకత్వం ఎదిగే అవకాశం లేకుండా పోయింది. సాగునీటి విషయంలో తెలంగాణ వెనుకబడి ఉన్నా రెండో పంచవర్ష ప్రణాళిక (1961–66) కాలంలో ఆంధ్ర ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలకు రూ.93.67 కోట్లు ఖర్చు చేయగా తెలంగాణలో కేవలం రూ.56.76 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో ప్రతిపాదించిన ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దేవునూరు, ఇచ్చంపల్లి ప్రాజెక్టులను పూర్తిగా రద్దుచేసింది. పోచంపాడు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. ఆంధ్రలో అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారని ముల్కీ నియమాలకు విరుద్ధంగా వారిని తెలంగాణకు కేటాయించారు. స్థానికంగా అర్హులైన అభ్యర్థులు లేరన్న నెపంతో చాలామందిని స్థానికేతరులను నియమించారు. ఒకానొక సందర్భంలో 2500 మంది ఆంధ్ర ప్రాంతం వారిని తెలంగాణలో ఉపాధ్యాయులుగా నియమించారు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం రాష్ట్ర, కేంద్ర, సాధారణ పరిపాలనా వ్యయానికి అయ్యే ఖర్చును ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు నిష్పత్తి ప్రకారం భరించాలి. ఈ ఖర్చు పోగా తెలంగాణ ఆదాయంలో మిగులును ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలి. అయితే ఆంధ్ర పాలకులు తెలంగాణ మిగులు నిధులను తెలంగాణ కోసం ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేశారు. పై విధంగా తెలంగాణ రక్షణల ఉల్లంఘన కారణంగా తెలంగాణ మనుగడ, అస్తిత్వం సంక్షోభంలో పడి 1969 తెలంగాణ ఉద్యమానికి దారితీసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆర్థిక వ్యవస్థలో సమాజ సేవకు నూతన రూపం... బ్యాంకుల జాతీయాకరణం - జూలై 19...బ్యాంకుల జాతీయాకరణ దినం

1969లో భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ప్రధాన మలుపుగా నిలిచిన సంఘటన బ్యాంకుల జాతీయాకరణ. అదే ఏడాది జూలై 19న, ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణ నిర్ణయం దేశ ఆర్థిక రంగాన్ని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థను సమూలంగా మార్చేసింది. అప్పటి వరకు బ్యాంకింగ్ రంగం ఒక పరిమిత వర్గానికి మాత్రమే సేవలందించేది. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు, పెద్ద రైతులు, పట్టణ వాణిజ్య వర్గాలకే ఇది అందుబాటులో ఉండేది. గ్రామీణ భారతం, వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమలు, పేద ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండిపోయారు. ఈ పరిస్థితిని మార్చాలని భావించిన ఇందిరా గాంధీ ప్రభుత్వం "బ్యాంకింగ్ ఆన్ ది డోర్ స్టెప్ ఆఫ్ ద పూర్" అనే ధ్యేయంతో బ్యాంకుల జాతీయాకరణ చర్యను చేపట్టింది. 1960వ దశకం భారతదేశానికి ఆర్థికంగా, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్న కాలం. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్నారు. ప్రైవేట్ బ్యాంకులు, ఎక్కువగా పారిశ్రామిక వర్గాల నియంత్రణలో ఉండి, ప్రధానంగా పెద్ద పరిశ్రమలు మరియు స్థాపిత వ్యాపారాల క్రెడిట్ అవసరాలను తీర్చడానికి మొగ్గు చూపాయి. వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు మరియు ఇతర ప్రాధాన్యత రంగాలను నిర్లక్ష్యం చేశాయి. ఇది రుణ పంపిణీలో గణనీయమైన అసమానతలకు దారితీసింది, సమ్మిళిత ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించింది. అలాంటి పరిస్థితులలో...జాతీయాకరణ ద్వారా ప్రభుత్వం, బ్యాంకులలో డబ్బులను నిర్లక్ష్యం చేయబడిన రంగాలకు మళ్లించగలదని, తద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించవచ్చని మరియు పేదరికాన్ని తగ్గించవచ్చని భావించారు. ప్రధానంగా నికర డిపాజిట్లు ?50 కోట్లకు మించిన 14 ప్రైవేట్ షెడ్యూల్డ్ బ్యాంకులను జాతీయాకరించారు. వీటిలో అల్లాహాబాద్ బ్యాంక్, బాంక్ ఆఫ్ బరోడా, బాంక్ ఆఫ్ ఇండియా, బాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేనరా బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,




యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు దేశ డిపాజిట్లలో 85% వరకూ నిర్వహిస్తున్నట్లుగా ఉండటంతో వాటి జాతీయాకరణ ద్వారా ప్రభుత్వానికి అధిక ఆర్థిక నియంత్రణ కలిగింది. బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక అభివృద్ధికి వినియోగించే దిశగా ఇది మలుపు తీసుకొచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ ద్వారా కొన్ని ప్రధాన లక్ష్యాలు చేరుకోవడం జరిగింది %–% వ్యవసాయ రంగానికి, చిన్న పరిశ్రమలకు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రుణాలందింపు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ శాఖల విస్తరణకు ఇది నాంది పలికింది. జాతీయాకరణ వల్ల ప్రధానంగా నాలుగు ప్రధాన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకటి... గ్రామీణ బ్యాంకింగ్ విస్తరణ. రెండోది...వ్యవసాయ, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజులకు రుణాల లభ్యత. మూడోది ... ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకుల మద్దతు. నాలుగోది ... మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర బహిష్కృత వర్గాల ఆర్థిక చేర్పు. 1969 నాటికి దేశవ్యాప్తంగా 8,200 బ్యాంక్ శాఖలే ఉండగా, 1991 నాటికి వాటి సంఖ్య 60,000 దాటింది. ఇందులో 30,000కు పైగా గ్రామీణ శాఖలు. వ్యవసాయరంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాల శాతం 1969లో 2.2% ఉండగా, 1980 నాటికి 15.8%కి పెరగడం గమనార్హం. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు మొదటిసారిగా అధికారిక ఆర్థిక వ్యవస్థకు చేరువయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ, విద్యా రుణాలు మొదలైనవి బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా అమలవుతూ వచ్చాయి. ఇక ఇందిరా గాంధీ పాలనకు ఇది రాజకీయంగా పెద్ద బలాన్ని ఇచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ పేద ప్రజల్లో మద్దతును పెంచడంతో పాటు, ఆమెను సామాజిక న్యాయమూర్తిగా ప్రజల్లో ప్రతిష్ఠించేందుకు దోహదపడింది. అయితే 1970లో సుప్రీంకోర్టు ఈ ఆర్డినెన్స్‌ను కొంతవరకూ చట్టవిరుద్ధంగా ప్రకటించడంతో, ప్రభుత్వం చట్ట సవరణ చేసి తిరిగి జాతీయాకరణను అమలు చేసింది. దీనికితోడు 1980లో మరోసారి ఆరు ప్రైవేట్ బ్యాంకులను జాతీయాకరించడం జరిగింది. వీటితో కలిపి ప్రభుత్వ యాజమాన్యం లోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల సంఖ్య 20కి చేరింది. అయితే జాతీయాకరణ తరువాత కూడా సమస్యలు లేవని చెప్పలేం. బ్యాంకుల్లో రాజకీయ దుర్వినియోగం, సంక్షేమ పథకాల పేరిట నష్టరుణాల మాఫీ, నిర్వాసిత ఆస్తుల శాతం పెరగడం (%చీూూ%), ప్రభుత్వ నియామకాల వల్ల పరిపాలనలో నైపుణ్యాల కొరత వంటి అంశాలు వ్యాపించాయి. అయినా ఇవన్నీ కలిపి చూసినపుడు, జాతీయాకరణ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సుదీర్ఘ, సామాజిక ధోరణిలో దిక్సూచి చూపడం జరిగింది. దేశంలో సగానికి పైగా జనాభా బ్యాంకింగ్ సేవలకు మించి ఉండే స్థితిలో ఉన్నది ఈ విధానానికే ఫలితం. 1991 ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రైవేట్ బ్యాంకులకు తిరిగి ప్రవేశం లభించినా, జాతీయాకరణ ద్వారా ఏర్పాటైన బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సామాజిక దృక్కోణం భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపాయి. నేటి ఆర్థిక చర్చల్లో బ్యాంకుల విలీనాలు, సంస్థాగత పునఃనిర్మాణం, డిజిటల్ బ్యాంకింగ్ వంటి అంశాలు ముందుకు వస్తున్నా %–% వాటికి బీజం వేసింది 1969లో తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణే. ఇది కేవలం పాలనా నిర్ణయం కాదు, దేశ ఆర్థిక ప్రణాళికలో ఒక మైలురాయిగా నిలిచింది. పేదల ఆర్థిక చేర్పును, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న విధానాల మొదటి మెట్టు ఇదే. ఇలాంటి చర్యల ద్వారానే సమతా, సమగ్ర అభివృద్ధికి దారులు వెలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పదముల ప్రవాహం - సముద్రాల సాహిత్య సౌరభం - జూలై 19...సముద్రాల రాఘవాచార్యులు వర్ధంతి



తెలుగు సినిమా అభివృద్ధిలో రచయితల పాత్ర అపారమైనది. సినీ రంగంలో కవులలో, సాహితీ వేత్తలలో సముద్రాల రాఘవాచార్యులు ప్రముఖులు. పౌరాణిక, భక్తిరస చిత్రాలకు ఆయన అందించిన పద్యాలు, సంభాషణలు తెలుగు భాష లోని కవితా బలాన్ని, వాక్పటుత్వాన్ని విశిష్టంగా ప్రతిబింబించాయి. సముద్రాల రాఘవాచార్యులు 1902 జనవరి 19న గుంటూరు జిల్లా రెపల్లె తాలూకాలోని పెద్దపులి వర్రు అనే గ్రామంలో జన్మించారు. సంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సంస్కృత విద్యాభ్యాసంలో రాణించారు. ఆయనకు పురాణాలు, ఇతిహాసాల పట్ల అపారమైన ఆసక్తి ఉండేది. ఈ అభిరుచి ద్వారానే ఆయన నాటక రంగం, తర్వాత సినీరంగానికి ప్రస్థానం ప్రారంభించారు. సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టి, అతి తక్కువ కాలంలోనే రచయితగా, సంభాషణ రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా అత్యంత విశేషమైన కీర్తిని సంతరించు కున్నారు. 1940 దశకంలో ఆయన పూర్తి స్థాయిలో రచయితగా పరిపక్వతను పొందారు. అప్పటి సినిమాల్లో ఆయన రచనలు గంభీరంగా నిలిచాయి. సముద్రాల రచనలు అన్నీ నెరళ్లు, గంభీరత కలిగి ఉండేవి. ఆయన రచించిన పాటలు శాస్త్రీయతను, భావ గంభీరతను కలిగి ఉండేవి. ఉదాహరణకు:"భక్త పోతన" చిత్రంలో: పద్యాలు, పాటలలో సంగీత పటిమ, రాగభావ నిక్షిప్తత ఎంత లోతైనదో గుర్తించ దగినది. ఇక "భక్త ప్రహ్లాద" చిత్రంలో: "ఇంద్రాది నీవే మరులదలచే..." ఇది శివుడిని ఆరాధిస్తూ చెప్పిన భక్తిరస పూరిత గీతం. ఈ పాటలలోని భాషా సౌందర్యం, ఛందోబద్ధత, భావనల తీవ్రత సముద్రాల రచనా కౌశల్యానికి నిదర్శనం. 1940లలో వచ్చిన "గృహలక్ష్మి" చిత్రానికి ఆయన అందించిన సంభాషణలు, పాటలు సామాజిక భావజాలానికి అద్దంపట్టినట్టుగా ఉండేవి. అలాగే "దేవదాసు" చిత్రంలో 'మానవ మనోవ్యథ'ను భాషలోని సహజతతో, కవితాత్మకతతో బలంగా వ్యక్తీకరించారు. పౌరాణిక చిత్రాలకు సముద్రాల రచనల్లో ఉండే సంస్కృత ధోరణి, అలంకారబద్ధత ప్రేక్షకులను అంతర్భావంగా ఆకట్టుకునేవి. ఉదాహరణకు "పాండవ వనవాసం", "బభ్రువాహన", వంటి చిత్రాలలో ఆయనే రచించిన పద్యాలు, సంభాషణలు, దర్శకత్వం ఇప్పటికీ ఆదరణ పొందుతూనే ఉన్నాయి. సముద్రాల దర్శకత్వం వహించిన చిత్రాలలో వినాయక చవితి, బబ్రువాహన ముఖ్యమైనవిగా నిలిచాయి. ఆయన తన స్వంత నిర్మాణ సంస్థ "సముద్రాల పిక్చర్స్" ద్వారా పలు చక్కటి చిత్రాలను నిర్మించారు. రచయితగా మాత్రమే కాక, దర్శకుడిగా కూడా కథ, పాత్రల రూపకల్పనలో ఆయన చూపిన దిట్టమైన దృక్పథం ప్రత్యేకత కలిగి ఉంది. ఆయన పాటలు వినిపించే ప్రతిసారీ తెలుగు భాషలోని శబ్ద సౌందర్యం, భావ ప్రవాహం మనసును హత్తుతుంది. ఆయన పాటలు, సంభాషణలు వినడం అంటే ఒక పాఠశాలలో అందమైన భాషను, ఛందస్సును నేర్చుకున్నట్టే. ఆయన పాటలు శ్రోతకు ఆధ్యాత్మికానందాన్ని, భక్తిభావాన్ని, విలువల బోధనను సమకూర్చేవి. సముద్రాల రచనా శైలి అతి గంభీరమైనది. ఆధ్యాత్మికత, శాస్త్రీయత, కళాత్మకత మేళ వించిన రచనలే ఆయనవివి. తెలుగు భాషను శిల్పంగా మలచ గలిగిన గొప్ప రచయితలలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. 1968లో ఆయన మృతి చెందినా ఆయన రచనలు, గీతాలు ఇప్పటికీ జీవిస్తూనే ఉన్నాయి. ఎన్నో చిత్రాలలో ఆయన రచనలు ఇంకా వినిపిస్తూ తెలుగు సినిమా మేధో సంపదను గుర్తు చేస్తున్నాయి. తెలుగు భాషాభిమానులకు, సినిమా రచయితలకు సముద్రాల రాఘవాచార్యులు ఒక మార్గదర్శి. సినీ సాహిత్యానికి పౌరాణిక ధారాదీప్తి అందించిన ఆ మహోన్నత రచయిత జీవితం తెలుగు సినీ చరిత్రలో అమర గాథగా నిలిచిపోతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బిల్లులు రాలేదు.. కష్టాలు తీరలేదు

కరీంనగర్ : మండల కేంద్రం దోమకు చెందిన రైతు కొమ్ముగల్ల బుగ్గయ్యకు పశువుల పాక మంజూరైంది. నిర్మాణం పూర్తయి ఆర్నెల్లు కావొస్తున్నా బిల్లులు మాత్రం అందలేదు. అప్పులిచ్చిన వారు అడుగుతున్నారని ఆయన వాపోతున్నాడు.దోమ మండలంలోని బసాపూర్‌లో ఇద్దరు అన్నదాతలు పనులు పూర్తి చేశారు. సాంకేతిక నిపుణులు కొలతలు తీసి బిల్లులకు ప్రభుత్వానికి పంపారు. డబ్బులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు.

మండల పరిధి కిష్టాపూర్‌లో మూడు పాకలు నిర్మించుకోడానికి అనుమతి ఉన్నా.. రైతులు ముందుకు రావడం లేదు. బిల్లుల వస్తాయో.. లేదోనని భయపడుతున్నారు.

పాడి రంగానికి ప్రాధాన్యమిచ్చి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల పాకల నిర్మాణానికి అవకాశం కల్పించాయి. ఈ పథకం అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాకల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ఇంకా బిల్లులు మాత్రం అందడం లేదు. దీంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**జిల్లాలో 680 మంది అర్హులు..**

జిల్లాలో పశువులు పెంచుతూ పాడి రంగంపై ఆధారపడి చాలామంది రైతులు జీవనోపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో పశు



వుల పాకల నిర్మాణానికి చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అధికారులు పథకం అమలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలో 561 పంచాయతీల్లో 680 మందిని ఉపాధిహామీ సిబ్బంది అర్హులుగా గుర్తించారు. వారిలో 344 మంది అన్నదాతలకు పాకల నిర్మాణానికి అనుమతి లభించింది. నిధులు రూ.3.10 కోట్లు మంజూరు కాగా.. 150 మంది పనులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 62 మంది గొర్రెలు, మేకలు, పాడి పశువుల పాకలు నిర్మించుకొని బిల్లులకు ఎదురుచూస్తున్నారు. డబ్బులు రావడం లేదంటూ మరికొందరు నిర్మాణాలు ప్రారంభించ లేదు.

**ప్రభుత్వానికి పంపించాం..-నర్సింములు, ఏపీవో, దోమ**

పాకల నిర్మాణాలు పూర్తయిన వాటి కొలతలు తీసి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి పంపాం. ఇంకా బిల్లులు రాలేదు. విడుదల చేస్తే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

# చారిత్రక కోటకు నిర్లక్ష్యపు బీటలు

జగిత్యాల : రెండున్నర దశాబ్దాల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన జగిత్యాల ఖిలా నాటి ప్రాభవాన్ని కోల్పోతోంది. శత్రు సేనలను నిలువరించిన మహాద్వారాలు, ఆయుధ సంపద ఏనాడో చోరుల పాలయ్యాయి. నిజాం సేనల పోరుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన కోట గోడలు సంరక్షణ కరవై బీటలు వారుతున్నాయి.

జగిత్యాలలో క్రీ.శ.1747లో ఎల్గందల కోటకు అధిపతిగా ఉన్న మీర్జా ఇబ్రహీంఖాన్ థింసా ఫ్రెంచి ఇంజినీర్ల సహకారంతో నక్షత్రాకారంలో ఖిలాను నిర్మించారు. శత్రువులు దాడి చేయకుండా కోట చుట్టూ నిర్మించిన బురుజుల్లో 6 అడుగుల లోతు కందకాలు తవ్వారు. వాటిలో మొసళ్లు ఉండేవని చరిత్ర చెబుతోంది. మందుగుండు సామగ్రి నిలువ చేయడానికి పెద్ద గదులుండేవి. 1791లో కోట రక్షణకు ఒక ఖిలేదార్, 210 మంది సిపాయిలుండేవారు. 1930 వరకు జగిత్యాల రెవెన్యూ కార్యాలయాల సేవలు ఖిలాలోనే నిర్వహించారు. కాలక్రమేణా ఖిలా సంపదతో పాటు చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి.

**ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంతో..**

2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఖిలాకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా అక్కడే నిర్వహించారు. 2016లో జగిత్యాల జిల్లాకేంద్రంగా మారిన తర్వాత రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతో పాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు ఖిలా వేదికగా నిలిచింది. ఈ క్రమంలో సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఖిలా వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. రెండేళ్ల కిందట జిల్లా సమీకృత పాలనా ప్రాంగణం(కలెక్టరేట్) పూర్తి కావడంతో వేడుకలను కలెక్టరేట్, పరేడ్ మైదానాలకు మార్చారు. ఈ నేపథ్యంలో ఖిలా అభివృద్ధి మళ్లీ కుంటుపడింది. పురావస్తు శాఖ



కాపలాదారును తొలగించడంతో తిరిగి అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది.

**ఆక్రమణలు.. సామగ్రి చోరీ**

పట్టణ జనాభా పెరగడంతో ఖిలా ప్రాంతం చుట్టూ జనావాసాలు పెరిగాయి. ఖిలా గోడలను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను పలువురు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కోట లోపల ఉన్న కర్ర తలుపులు, ఇనుప సామగ్రి, ఫిరంగులు తదితర సంపదను కొల్లగొట్టారు. ఖిలా లోపల అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయి. దశాబ్దం కిందటి వరకు ఖిలాలో దుర్గంధం వ్యాపించేది. స్థానికంగా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొంది.

**వ్యర్థాలతో దుర్గంధం**

ఖిలా వెలుపల, లోపల పూర్తిగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. అయిదేళ్ల కిందట ప్రభుత్వం నాటిన మొక్కలు ఎదిగి పచ్చదనం సంతరించుకున్నా నిర్వహణ కరవైంది. కోట చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు పలుమార్లు బల్దియాకు ఫిర్యాదు చేశారు. ఖిలా ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ పరికరాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. జగిత్యాలకు తలమానికమైన చారిత్రక సంపదకు పూర్వ వైభవం తేవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

# అనుమతులు కొన్ని.. అక్రమాలు లెక్కలేనన్ని



హైదరాబాద్ : రసాయన పరిశ్రమల్లో అనుమతుల్లేకుండా ఆర్‌అండ్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) యూనిట్లు ఏర్పాటు చేస్తున్న కొందరు సమ్మతి లేని ఉత్పత్తులు కూడా తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీకల్లు మరణాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో అందులో వాడే ఆల్ప్రాజోలం తయారీ యూనిట్‌పై పీసీబీ ఇటీవల చర్యలు తీసుకుంది. కామారెడ్డి జిల్లా మద్నూర్ ఠాణాలో దాఖలైన కేసు ఆధారంగా నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్స్ ఆర్‌అండ్‌డీ యూనిట్‌లో అల్ప్రాజోలం తయారు చేస్తున్నట్టు సమాచారం అందుకున్న పీసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కన్సెంట్ ఫర్ ఆపరేషన్, కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు లేకుండానే బల్క్‌డ్రగ్, ఉత్పత్తుల సంశ్లేషణలో పరిశోధన చేస్తున్నట్టు గుర్తించి ఆ యూనిట్ మూసివేతకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్పత్తి సామర్థ్యం ఒక కేజీకి మించొద్దు.. పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) లేకుండా అనేక పైలట్ ప్లాంట్లు నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బాహ్యవలయ రహదారి పరిధిలో ఫార్మా, బల్క్‌డ్రగ్, బల్క్‌డ్రగ్ మధ్యంతర ఉత్పత్తుల ఆర్‌అండ్‌డీ యూనిట్లను ఏర్పాటు చేయెుద్దనే ఉత్తర్వులున్నాయి. పరిశోధనల్లో ఉత్పత్తి సామర్థ్యం రోజుకు ఒక కేజీకి మించొద్దనే నిబంధనలున్నాయి. ఇవేవీ పాటించకుండా వందల లీటర్ల సామర్థ్యం ఉన్న యంత్రాలతో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. సాధారణంగా ఆర్‌అండ్‌డీ యూనిట్ నెలకొల్పడానికి 50 నుంచి 100 లీటర్ల ఫ్లాస్క్ సామర్థ్యం నిబంధనను పట్టించుకోకుండా 500 నుంచి 1,000 లీటర్ల సామర్థ్యంతో రియాక్టర్లు ఏర్పాటు చేసి ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. యూనిట్‌లో రూ.కోట్ల విలువైన ఉత్పత్తులు కొనసాగిస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండానే నాలుగైదు అంతస్తుల ఆర్‌అండ్‌డీ యూనిట్లు, కింద పైలట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, ప్రశాంత్‌నగర్, ప్రగతినగర్ రాజీవ్‌నగర్, గాంధీనగర్, జీడిమెట్ల, మేడ్చల్, హయత్‌నగర్‌లో ఈ తరహా పైలట్ ప్లాంట్లు ఎక్కువగా నడుస్తున్నాయి.

**జాబితా ఆధారంగా తనిఖీలు చేస్తే..**

పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోతే పరిశ్రమ కోసం పెట్టిన పెట్టుబడిలో 30 శాతం వరకు జరిమానా విధించే ఆస్కారం ఉంది. మున్సిపల్, జీఎస్టీ, పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు తీసుకున్న జాబితాను పరిశీలిస్తే ఎక్కడ, ఏయే పరిశ్రమలు ఏ ఉత్పత్తులు తయారు చేస్తున్నాయో తెలిసే అవకాశం ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా తనిఖీలు చేస్తే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంటుంది.

# తెర వెనక రియల్టర్లు.. భారీ ప్రణాళికలు



హైదరాబాద్ : రాజధానికి సమీపంలోని మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో గోశాల భూములను కొట్టేసేందుకు కొందరు రియలర్టు తెరవెనుక భారీ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించారు. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీస్తుండగా తెర వెనుక భారీ రియల్టర్లున్నారని ప్రాథమిక సమాచారం లభించిందని తెలిసింది. ఎన్కేపల్లికి చెందిన కొందరిని ప్రలోభపెట్టి వారి పేర్లమీద నకిలీ పత్రాలు సృష్టించి ఈ-పాస్‌పుస్తకాలను పొందాలన్న లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్టు పోలీసులకు సమాచారం లభించింది.


**హెచ్ఎండీఏ ప్రాజెక్టు సాధ్యం కాకపోవడంతో..**

200 ఎకరాలను మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం హుడాకు అప్పగించింది. ఇవి జీవో 111 పరిధిలో ఉండడంతో ఆ ప్రతిపాదన అక్కడితో ఆగిపోయింది. మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఉన్నతాధికారులు 111జీవోను సమీక్షిస్తూ జీవో నంబరు 69ను జారీచేశారు. దీంతో జంట జలాశాయ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు భూములు, పట్టా భూముల్లో వెంచర్లు నిర్మించుకోవచ్చని రియల్టర్లు భావించారు. ఖాళీగా ఉన్న ఎన్కేపల్లిలో హెచ్ఎండీఏ భూములు ఆక్రమించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**రెవెన్యూ అధికారులతో మంతనాలు.. బేరాలు**

ఎన్కేపల్లి భూములను కొంచెం కొంచెం ఆక్రమించుకుంటే ఎవరికీ అనుమానం రాదనుకున్నారు. ఇద్దరు రెవెన్యూ అధికారులతో రెండేళ్ల క్రితం ప్రాథమికంగా సంప్రదింపులు జరిపారు. సానుకూల స్పందన రావడంతో ప్రభుత్వ భూములను పట్టాభూములుగా మార్చేందుకు ప్రయత్నాలు చేశారు. సర్వేనంబర్ 180కి బై నంబర్లు వేసుకోవాలని, వాటిని పార్టులుగా విభజించి ఈ-పాస్‌పుస్తకాలు మంజూరు చేయించుకోవాలన్నది ప్రణాళిక. నకిలీ పత్రాలతో పట్టాలు సృష్టించినా ఈ-పాస్ పుస్తకాలు రాలేదు. ఈలోపు ఇద్దరు రెవెన్యూ అధికారులు బదిలీ కావడంతో ఆక్రమణలకు బ్రేక్ పడింది.

# అంతా సిద్ధం.. అయినా సేతమతం




హైదరాబాద్ : అవన్నీ వందల కోట్ల విలువైన ప్లాట్లు.. ఇప్పటికే అక్కడ లేఅవుట్లు అభివృద్ధి చేసి కొన్ని విక్రయించారు. ఇంకా కొన్ని అలాగే మిగిలి ఉన్నాయి. కొన్ని లేఅవుట్లలో ఆక్రమణలు కూడా సాగుతున్నాయి. మేడిపల్లి లేఅవుట్‌లో పార్కు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని తాజాగా అసోయేషిన్ ప్రతినిధులు హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఇప్పటికే శంషాబాద్‌లోని ఉన్న హెచ్ఎండీఏ స్థలాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేయడంతో కోర్టు జోక్యంతో తిరిగి హెచ్ఎండీఏ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. కొన్నేళ్లుగా లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్లను విక్రయించడంలో హెచ్ఎండీఏ తాత్సారం చేస్తోంది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్పా...కార్యాచరణ కన్పించడం లేదు.

గతంతో పోల్చితే స్థిరాస్తి మార్కెట్ ఊపందుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు లేఅవుట్ల, భవనాల నిర్మాణాల కోసం పెరిగిన అనుమతులే ఇందుకు నిదర్శనం. జూన్ నెలాఖరు నాటికి 922 అనుమతులు ద్వారా రూ.519.84 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

**నాన్చుడు ఎందుకో..** హెచ్ఎండీఏ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న లేఅవుట్లను ఇప్పటికే అధికారులు లెక్క తేల్చారు. ఎక్కడెక్కడ ఎన్ని ప్లాట్లు ఉన్నాయి.. మిగిలిన ప్లాట్లను గుర్తించి వేలం ద్వారా విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ప్రాంతీయ రింగ్‌రోడ్డు మధ్యలోనే ఎక్కువ లేఅవుట్లు ఉన్నాయి. ప్రస్తుతం నగరంతా అటే విస్తరిస్తోంది. హెచ్ఎండీఏ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంటుందని అధికారులు సైతం భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు లేవుట్లలో ప్లాట్లు కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. సదరు భూమి వెనుక వివాదాలు ఏమైనా ఉన్నాయా.. అనేది కీలకం. సరైన వివరాలు ఇచ్చేవారు కరవే. హెచ్ఎండీఏ, రేరా, డీటీసీపీ అనుమతులు లేకపోయినా.. ఏజెంట్లను పట్టుకొని అవగాహన లేనివారికి కొందరు అంటగడుతున్నారు. తీరా కొన్నాక అసలు విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. అదే హెచ్ఎండీఏ సంస్థలోని ప్లాట్లకు అలాంటి ఇబ్బంది ఉండదు. దీంతో ఎక్కువ మంది ఇలాంటి లేఅవుట్లలో కొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. రెండేళ్ల క్రితం పలు లేఅవుట్లలో వేలం వేసిన ప్లాట్లకు మంచి గిరాకీ వచ్చింది. చదరపు గజం సరాసరి రూ.60 వేల నుంచి 70 వేల వరకు పలికింది. ప్రస్తుతం ఆయా లేఅవుట్లల్లో ఇంకా చాలా ప్లాట్లు మిగిలే ఉన్నాయి. ఇలానే ఖాళీగా విడిచి పెడితే ఆఖరికి కబ్జాల పాలుకానున్నాయి. వెంటనే వీటిపై నిర్ణయం తీసుకుంటే నిధులు సమకూరి వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

# నిధులు ఊడ్చేసి.. కార్మికులతో ఊడ్పిస్తూ

హైదరాబాద్ : పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో జీహెచ్ఎంసీ చెలగాటం ఆడుతోంది. నిధుల్లేవంటూ.. ప్రధాన రహదారులను శుభ్రం చేసే యంత్రాలను పక్కనపెట్టింది. ఇటీవల కాంట్రాక్టు గడువు ముగియగా టెండరును పునరుద్ధరించలేదు. బల్దియా కార్మికులతో రోడ్లు ఊడ్పిస్తున్నారు.

**ఏడాదికి రూ.43 కోట్లు**

నగరంలోని ప్రధాన రహదారులపై 24 గంటలపాటు వాహనాల రాకపోకలుంటాయి. రాత్రిపూట గంటకు 100కి.మీ.కన్నా ఎక్కువ వేగంతో వాహనాలు దూసుకెళుతుంటాయి. వాహనాలు ఢీకొని అనేక మంది కార్మికులు చనిపోయారు. దీంతో భారాస హయాంలో 2018లో 18, 2021లో మరో 20 యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. 38 యంత్రాలకుగాను ఏటా రూ.43 కోట్లు చెల్లిస్తున్నారు.

**స్వచ్ఛ ర్యాంకు కోసం..**నగరంలో రహదారులను యంత్రాలతో శుభ్రం చేయిస్తున్నామంటూ స్వచ్ఛభారత్ సర్వేలో బల్దియా మార్కులు పొందింది. ఉత్తమ పురస్కారాన్నీ గెలుచుకుంది. జులై 17న అవార్డు తీసుకునేందుకు అధికారులు దిల్లీ వెళ్తున్నారు. వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి.ఇతర మెట్రో నగరాలతో పోటీపడాలి. జీహెచ్ఎంసీని చూస్తే అలా పనిచేస్తున్నట్టు కనిపించడం లేదు. నిధుల్లేవని ఊడ్చే యంత్రాల సేవలను నిలిపేయడం సబబు కాదు. రహదారుల ప్రైవేటు నిర్వహణను కూడా అలాగే నిలిపేశారు అంటూ హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసుదుద్దీన్ ఒవైసీ బల్దియా కమిషనర్‌కు లేఖ రాశారు.

# కాగితాల్లో ఇళ్లు.. కనిపించని నిర్మాణాలు



కరీంనగర్ : నగర పరిధిలో ఆస్తిపన్ను, ఇంటినంబర్ జారీకి సంబంధించిన సెల్ఫ్ అసెస్‌మెంట్(స్వీయ మదింపు)పై విచారణ ముమ్మరం చేశారు. ఆన్‌లైన్‌లో యజమానుల దరఖాస్తులు ఆమోదించడం, క్షేత్రస్థాయిలో ఇల్లు ఉందా లేదా? అనే వివరాలు తెలుసుకోకపోవడంతో పొరపాట్లు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలకు ఏరకంగా ఇంటినంబర్లు వచ్చాయో నగరపాలక, రెవెన్యూ అధికారులు అయిదారు రోజులుగా సర్వే చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ఇప్పటివరకు జారీ చేసిన ఇంటి నంబర్లను తనిఖీ చేస్తున్నారు. ప్రస్తుతం రేకుర్తిలో చేస్తుండగా, బొమ్మకల్, తీగలగుట్టపల్లిలోనూ చేయనున్నారు.

**ఖాళీ స్థలాలకూ ఇంటి నంబర్లు**

రేకుర్తి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు అధికంగా ఉండటంతో అన్యాక్రాంతం అవుతున్నట్లు అయిదారు ఏళ్లుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై రిజిస్ట్రేషన్లు కూడా చేసుకోవడం, దర్జాగా ఇంటినంబర్లను ఆన్‌లైన్‌లో తీసుకోవడం సులువుగా మారింది. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వకూడదు. నివాసం ఉండేలా నిర్మించుకున్న గదులకు, ఇళ్లకు నంబర్లు జారీ చేయాలి. అదేది లేకుండానే మదింపు చేశారు. మూడు, నాలుగు గుంటలు స్థలముండి ఒక గది నిర్మించుకున్నా ఇంటినంబర్ జారీ అయ్యింది. ప్రస్తుతం నంబర్లు కాగితాల్లో కనిపిస్తుండగా మోఖా మీద ఇళ్లు మాత్రం కనిపించడం లేదు.

**సర్వేలో 189 గుర్తింపు**

ఒక్క రేకుర్తిలోనే ఇంటి నంబర్లు ఉండి నిర్మాణాలు లేనివి, ఒక గది మాత్రమే నిర్మించినవి, ప్రభుత్వ సర్వే నంబర్లలో ఉన్నవి ఇప్పటివరకు 189 గుర్తించారు. అధికారుల సర్వేలో నంబర్లు ఉన్నా ఇళ్లు కనిపించడం లేదు. గతేడాది ఇలాగే సర్వే చేసి అయిదు ఇంటినంబర్లు రద్దు చేశారు. ఇప్పుడు కూడా గుర్తించినవి రద్దు చేసి రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాయనున్నారు.

**త్వరలో మరో రెండు కాలనీలు**

విలీన కాలనీల్లో స్వీయ మదింపులో అక్రమాలు బయటకు వస్తుండటంతో వీటిపై పూర్తిస్థాయిలో సర్వే చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వీయ మదింపు సమయంలో తప్పుగా ఇంటి విస్తీర్ణం, కొలతలు నిర్వహించుకున్న వారికి, తప్పుగా నంబర్లు తీసుకున్న వారికి 25 రెట్లు జరిమానా విధించాల్సి ఉంటుంది. కచ్చితంగా జరిమానా విధించాల్సిందేనని అధికారులు చెబుతుండగా, భవిష్యత్తులో లావాదేవీలు జరిపిన సమయంలోనైనా వీటిని వసూలు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

# తనిఖీలు నామ'మాత్ర'మే!

కరీంనగర్ : ఔషధ నియంత్రణపై పర్యవేక్షణ లేక ఉమ్మడి జిల్లాలో తరచూ నకిలీలలు బయటపడుతున్నాయి. అడపాదడపా తనిఖీలతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఎక్కువ కమీషన్ వచ్చే ప్రాధాన్యత లేని మందులకే పెద్దపీట వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 800కు పైగా ప్రైవేటు ఆస్పత్రులు, 2 వేలకు పైగా ఔషధ విక్రయ దుకాణాలున్నాయి. హోల్‌సేల్‌గా విక్రయించే 180 ఏజెన్సీలున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ రూ.7-9 కోట్ల వ్యాపారం జరుగుతోంది.

**వారికంతా మామూలే!**

నాలుగు జిల్లాల పరిధిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతోపాటు ఉమ్మడి జిల్లా, రీజియన్ స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే చిన్నాపెద్ద ఆస్పత్రులన్నీ 500కు పైగా ఉన్నాయి. వీటి పరిధిలోని మందుల దుకాణాల్లో నెలకోసారి కూడా తనిఖీలు నిర్వహించడం లేదు. కొందరు వ్యాపారులు దుకాణాల వద్దకు అధికారులు రాకుండా పలు రకాలుగా పలుకుబడిని ప్రయోగిస్తున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది. పలువురు అధికారులు తనిఖీలను 'మామూలు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేవలం 27 కేసులు మాత్రమే నమోదయ్యాయి. అంటే సగటున నెలకు రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ విషయమై ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు శ్రీనివాస్ వివరణ



కోరగా తనిఖీల విషయంలో జాప్యం చేయడం లేదని, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

**చిన్న కేసులే అధికం**

సిరిసిల్ల జిల్లాలో తనిఖీ చేసిన ప్రతిసారీ ఆయుర్వేద సంబంధిత ఔషధాలే పట్టుబడ్డాయి. ముఖ్యంగా కిడ్నీలో రాళ్లు తొలగించడానికి, లావు తగ్గడానికి వాడే పొడి రూపంలోని మందులను, నిషేధిత పదార్థాలను పట్టుకున్నారు.గతేడాది అక్టోబరు 16న కరీంనగర్‌లో రూ.4.87 లక్షల విలువైన ఈఎస్ఐ మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా అజ్ఞాత వ్యక్తులిచ్చిన ఫిర్యాదు ఆధారంగానే ఈ కేసు నమోదు చేశారు. మిగతా సోదాల్లో చిన్న చిన్న మాత్రలను మాత్రమే గుర్తించారు.

ముఖ్యంగా లైసెన్సులు లేని వాటి విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో తయారైన నకిలీ ఔషధాలను కొన్ని దుకాణాల్లో స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్‌లో జులై 11న యాంటీ క్యాన్సర్ ఇంజిక్షన్‌ను నిర్ణీత ధర కన్నా రూ.668 అధికంగా అమ్ముతుండగా పట్టుకున్నారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా వసూలు చేస్తున్నందుకు కేసు పెట్టారు.



# నిమిష ప్రియ కేసు.. అది కేంద్రాన్నే అడగండి: సుప్రీంకోర్టు

దిల్లీ: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ కేసులో బాధిత కుటుంబంతో మాట్లాడేందుకు తాము యెమెన్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని నిమిష తరఫున బృందం సుప్రీంకోర్టును కోరింది. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. అందుకోసం కేంద్ర ప్రభుత్వం వద్దకే వెళ్లాలని సూచించింది. నిమిష ప్రియ కేసుపై తాజాగా అత్యున్నత న్యాయస్థానం మరోసారి విచారణ జరిపింది. ఈసందర్భంగా ఆమెకు మరణశిక్ష అమలును యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్రం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోర్టుకు తెలిపారు. ఆమె క్షేమంగా స్వదేశానికి తిరిగిరావాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందనపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తంచేసింది. నిమిష ప్రియ కేసులో కేంద్రం సాధ్యమైన ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. విచారణ సందర్భంగా నిమిష ప్రియ తరఫున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది. యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16న మరణశిక్ష అమలుచేయాల్సిఉండగా.. చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వం దీన్ని వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. అయితే, ఈ బ్లడ్ మనీకి తాము ఎన్నటికీ అంగీకరించబోమని బాధిత కుటుంబం చెబుతోంది. దీంతో ఈ కేసు ఎలా ముగుస్తుందోన్న ఉత్కంఠ నెలకొంది.




హైదరాబాద్: తమ ఆస్తులు ఆక్రమణదారులకు చిక్కకుండా ప్రజలే పరిరక్షించుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంట వద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టర్ హరి చందన, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారందరితో నీటి వనరుల పరిరక్షణపై హైడ్రా ప్రతిజ్ఞ చేయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బతుకమ్మ సంబురాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని తెలిపిన రంగనాథ్.. అందుకు అనుగుణంగా బతుకమ్మకుంటను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

**ఏడాదిలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం..** ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఏడాదిలో హైడ్రాకు ఎన్నో మంచి, చెడు అనుభవాలు ఎదురయ్యాయి. విపత్తుల నిర్వహణకు సంబంధించి పక్కా ప్రణాళికతో హైడ్రా పనిచేస్తుంది. ఏడాదిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాం. హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30 వేల కోట్లపైనే ఉంటుంది. ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నాం, వాటి విస్తీర్ణం రెట్టింపు స్థాయిలో పెరిగింది. రహదారులపై, మూసీలో వృథాగా పోయే నీటిని చెరువుల్లోకి మళ్లిస్తున్నాం. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షిస్తున్నాం. న్యాయపరమైన సవాళ్లను కూడా అధిగమిస్తూ భూములను కాపాడుతున్నాం. కూల్చడమే కాదు నిర్మాణం చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష. రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో చెరువులను హైడ్రా అభివృద్ధి చేస్తుంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

**ఒవైసీ కళాశాలపైనే పదేపదే ఎందుకు ప్రశ్నిస్తున్నారు..** ఆక్రమణలను నివారించడంతో పాటు.. హైడ్రా రాకముందు నిర్మించుకున్న ఇళ్లకు మినహాయింపు ఇచ్చాం. ప్రభుత్వం హైడ్రాకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తుంది. ఆక్రమణల వెనుక చాలా మంది పెద్దవాళ్లు ఉంటారు. వాళ్లు తప్పించుకోవడానికి పేదలను బుల్డోజర్ల ముందు పెడుతున్నారు. పేదవాళ్ల మీద హైడ్రా పగబట్టిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. రూ.30-40 కోట్ల పార్క్ స్థలాన్ని ఆక్రమించే ధైర్యం పేదవాళ్లకు ఉంటుందా. హైడ్రాపై చాలా సార్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీకి సంబంధం లేకున్నా హైడ్రాకు ముడిపెట్టారు. ఒవైసీ కళాశాల విషయంలో మా నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పాం. హైడ్రా ఒక సామాజిక కోణంలో పనిచేస్తుంది. ఒవైసీ కళాశాల 2015-16లో నిర్మించారు. కళాశాల ఉన్న చెరువు ప్రాంతానికి 2016లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. సల్కం చెరువుకు తుది నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదు. నగరంలోని 80 శాతం చెరువులకు తుది నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదు. 140 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ ఇచ్చారు. 540 చెరువులకు పదేళ్ల కిందట ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. సల్కం చెరువు నోటిఫికేషన్ ప్రాసెస్‌లో ఉండగా ఎవరికి వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అనధికారిక నిర్మాణాలను తప్పకుండా తొలగిస్తాం. ఒవైసీ కళాశాలపైనే పదే పదే ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఆ కళాశాలపై ఎందుకు అంత ఆసక్తి?ఏ వర్గం కళాశాల అయినా ఒకటే రూల్ వర్తిస్తుంది. సామాజిక కోణంలో కూడా ఆలోచించాలి. హైడ్రా ఏడాది కిందట వచ్చిన సంస్థ.. అంతకుముందు కట్టిన వాటికి కూడా ఒకటే రూల్ ఉండాలనేది సరైన పద్ధతి కాదు" అని కమిషనర్ రంగనాథ్ అన్నారు.




## ఏపీ మద్యం కేసు.. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో (ఏ4) నిందితుడు, వైకాపా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. అరెస్టు చేయకుండా ఛార్జిషీట్ ఎలా దాఖలు చేశారని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం సిట్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పొందడానికి ఎలాంటి కారణాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం అడిగింది. విచారణ అనంతరం ముందస్తు బెయిల్ కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. లొంగిపోవడానికి సమయమిచ్చేందుకు కూడా సుప్రీంకోర్టు విముఖత చూపింది. మద్యం కేసులో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల ఏపీ హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డిపై సిట్ అధికారులు ఇప్పటికే లుకౌట్ సర్క్యులర్ (ఎల్వోసీ) జారీ చేశారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో.. విదేశాలకు పారిపోకుండా అడ్డుకునేందుకు ఈ ఎల్వోసీ ఇచ్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసే అవకాశముందని ముందే గ్రహించిన మిథున్‌రెడ్డి అప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ దాక్కున్నారో తెలుసుకునేందుకు సిట్ బృందాలను ఏర్పాటు చేసింది. మద్యం కుంభకోణం కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత మిథున్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోవటం ఇది రెండోసారి. ఈ కుంభకోణంలో తన ప్రమేయం సిట్ దర్యాప్తులో బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం మార్చిలో హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చకపోవడంతో కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. తనను అరెస్టు చేస్తారేమోననే భయంతో మిథున్‌రెడ్డి అప్పట్లో అజ్ఞాతంలో ఉంటూనే.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టులో విచారణ కొనసాగినంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో బయటకొచ్చారు. ఇప్పుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి ఆచూకీ తెలిస్తే.. ఆయన్ను సిట్ అధికారులు వెంటనే అరెస్టు చేసే అవకాశముంది.

## యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణ.. టెండర్లు పూర్తి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: వరంగల్ విమానాశ్రయానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో హైదరాబాద్ మినహా ఇతర పట్టణాల్లో విమానాశ్రయాలు లేవు. కేంద్రం ఎన్ని సార్లు అడిగినా గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదు.

కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కేంద్రం వేగంగా పూర్తి చేస్తోంది. కాజీపేట యూనిట్‌ను కోచ్, వ్యాగన్ల నుంచి ఇంజిన్ల తయారీ వరకు విస్తరిస్తున్నాం. బడ్జెట్ కూడా రూ.200 కోట్లతో ప్రారంభమై మరో రూ.200 కోట్లు పెరిగింది.

కాజీపేట రైల్వే పరిశ్రమతో దాదాపు 3వేల ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రానికి అనేక కొత్త రైళ్లు మంజూరు అవుతున్నాయి. జోధ్‌పూర్, కచ్, అహ్మదాబాద్‌కు నేరుగా రైలు సర్వీసులు వస్తాయి. ఎంఎంటీఎస్‌ను యాదగిరిగుట్ట వరకు విస్తరించాలని నిర్ణయించాం. ఎంఎంటీఎస్ విస్తరణకు టెండర్లు పూర్తయ్యాయి" అని కిషన్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. ఈరోజు తెల్లవారుజామున 3గంటల సమయంలో లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు చనిపోయారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. మృతులను మాలోత్ చందులాల్ (29), గుగులోత్ జనార్దన్ (50), కావలి బాలరాజు (40), జాడ కృష్ణ, దాసరి భాస్కరరావుగా గుర్తించారు.



## కడప సెంట్రల్ జైలులో డీఐజీ విచారణ..

### ఎర్రచందనం స్మగ్లర్ నుంచి 10 సెల్‌ఫోన్లు స్వాధీనం!

కడప: కడప కేంద్ర కారాగారంలో ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు పట్టుబడుతుండటంపై జైళ్ల శాఖ డీజీ విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో కడప జైలులో రాజమహేంద్రవరం జైలు డీఐజీ రవికిరణ్ విచారణ చేపట్టారు. ఖైదీలతో పాటు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కడప జైలులో పీడీ యాక్ట్ కింద అరెస్టై రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి నుంచి 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ రిమాండ్ ఖైదీ ఎర్రచందనం స్మగ్లర్‌గా తెలుస్తోంది. సెల్‌ఫోన్లపై వ్యవహారంలో జైలు సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమవడంతో జైళ్లశాఖ డీజీ సీరియస్‌గా తీసుకున్నారు. ఈమేరకు విచారణకు ఆదేశించారు.

## రాష్ట్రంలోని హైడల్ ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నాగార్జునసాగర్: రాష్ట్రంలోని హైడల్ ప్రాజెక్టులన్నింటినీ పర్యవేక్షిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునీకరణ జరగాల్సి ఉందని చెప్పారు. నాగార్జునసాగర్ హైడ్రో పవర్‌ప్లాంట్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "ఏడాదిలో 2వేల మెగావాట్ల అధిక విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. హరిత విప్లవం కోసం కాంగ్రెస్ అనేక ప్రాజెక్టులు నిర్మించింది. ప్రపంచదేశాలకు పంట ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగింది" అని భట్టి విక్రమార్క అన్నారు.

## ఇంటర్ విద్యార్థిని హత్య కేసులో వీడని మిస్టరీ.. వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు



గండికోట: కడప జిల్లా గండికోట ఇంటర్ విద్యార్థిని హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. హత్య కేసు ఇంకా మిస్టరీగానే ఉంది. గురువారం రాత్రి విద్యార్థిని సోదరుడు సురేంద్ర, మరో వ్యక్తి కొండన్నను పోలీసులు విచారించి పంపించారు. సాంకేతిక ఆధారాల కోసం దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినిని బాగా హింసించి చంపారని నిర్ధరించారు. గండికోట రంగనాయక స్వామి ఆలయం వద్ద కాలేజీ బ్యాగు లభ్యం కాగా.. మరోచోట మృతదేహం కనిపించడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకచోట చంపి మరోచోట పడేశారని భావిస్తున్నారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు, గండికోటకు వచ్చిన అల్లరి మూకలను ప్రశ్నిస్తున్నారు. పోలీసులు మరోసారి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.




కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల గ్రాంట్ విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మెల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సూర్జేవాలా సీఎం, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై అంతర్గతంగా జరిగిన చర్చ అనంతరం.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేటాయింపుల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంట్‌ను పొందనున్నారు. ఇదిలా ఉంటే.. నిధుల విడుదలలో జాప్యంపై ఎమ్మెల్యేల్లో కొద్దికాలంగా తీవ్ర అసహనం నెలకొంది. ఈ విషయమై గత నెల కాగ్వాడ్ ఎమ్మెల్యే రాజు కగే.. సొంత ప్రభుత్వంపై బహిరంగంగా అసహనం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని, ఈ వైఫల్యంపై తాను నిరాశ చెందానని విమర్శలు చేశారు. అలాగే రాజీనామాకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయం వెలువడింది. ఇదిలా ఉంటే.. కొద్దిరోజులుగా కర్ణాటక రాజకీయాలు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతుండటం, అగ్రనాయకులు వాటిని తోసిపుచ్చుతున్న పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మరోపక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు కోసం ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు బేరసారాలు మొదలుపెట్టారని భాజపా ఆరోపిస్తోంది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు వాళ్లిద్దరూ సిద్ధంగా ఉన్నారని విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వాదనను తోసిపుచ్చుతూ.. ఈ విధంగా స్పందించింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS, ALUGUNOOR(V),TIMMAPOOR(M), KARIMNAGAR DISTRICT, TELANGANA "PUBLISHED FORM,HNO.5-2-107,OSMANPURA, JAGITYALA DISTRICT, JAGITYALA, TELANGANA -RNI NO.APTEL/2011/39782 PH.NO :- 9848999998